# తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

**రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే.. సీఎం కాబోయేది కేసీఆరే..**

- నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి
- వెల్దుర్తి మండలంలో ముమ్మరంగా ప్రచారం
- ప్రభుత్వ పథకాలను వివరిస్తుంటే అపూర్వ స్పందన
- గ్రామగ్రామాన డప్పుచప్పుళ్లు, పటాకులు కాల్చుతూ ఘనస్వాగతం



బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

వెల్దుర్తి, నవంబర్ 8: సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ సర్కారు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు యావత్ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని నర్సాపూర్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం వెల్దుర్తి మండలంలోని యశ్వంతరావుపేట, తండా, మన్నెవారి జలాల్‌పూర్, తండా, దామరంచ, అక్కమ్మపల్లి, ధర్మారం, అందుగులపల్లి, మహ్మద్‌నగర్ తండా, మానేపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలనుద్దేశించి వారు మాట్లాడుతూ ఉద్యమాల ద్వారా సాధించుకున్న తెలంగాణను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్ది, బంగారు తెలంగాణగా మార్చాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ సుపరిపాలనను అందిస్తుంటే, కాంగ్రెస్, బీజేపీలు సీమాంధ్ర పార్టీలు కుమ్మక్కై తెలంగాణను దోచుకోవడానికి చూస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోనే మధిర గ్రామాలతో పాటు తండాలు గ్రామ పంచాయతీలుగా మారాయని, గ్రామాలు, తండాలు అనే తేడా లేకుండా అన్ని దారులు సీసీ రోడ్లుగా మారాయన్నారు. వీటితోపాటు మురుగు కాల్వలు నిర్మించారన్నారు. పెన్షన్ల పెంపుతోపాటు ఉచిత విద్యుత్, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా హల్దీవాగులో ఎండాకాలంలోనూ నీళ్లు పారుతుంటే గోదావరి నదిలా కనిపిస్తున్నదన్నారు. ఎండాకాలంలో ఎలాంటి సాగునీటి సమస్యలు లేకుండా పూర్తిస్థాయిలో నేడు పంటలు పండించుకుంటున్నామన్నారు. అన్ని వర్గాల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా దళిత బంధుతోపాటు బీసీ బంధు, మైనార్టీ బంధు అందిస్తూ కులవృత్తులకు అండగా నిలుస్తున్నారన్నారు. నిరుపేదల విదేశీ విద్యకు రూ. 20 లక్షల వరకు ఆర్థిక సాయం అందించి, ఆదుకుంటున్నారన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనను, గతంలో ఉన్న ప్రతిపక్షాల పాలనను చూసి ఓట్లు వేయాలన్నారు. మారుమూల గ్రామాలు ఆదర్శంగా కావాలంటే, అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించి, కేసీఆర్‌ను సీఎం చేయాలన్నారు.



ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న అభ్యర్థి సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



మన్నెవారి జలాల్‌పూర్‌లో గజమాలతో సత్కరిస్తున్న గ్రామ యువకులు

### గెలిపించండి.. మరింత అభివృద్ధి చేసుకుందాం: ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

బీఆర్ఎస్ పార్టీని అన్ని వర్గాలు ఆదరిస్తున్నాయని, రెండు పర్యాయాలు నియోజకవర్గ ప్రజలు ఓట్లు వేసి తనను గెలిపించారని, వారికి అన్ని వేళలా అండగా ఉంటూ అభివృద్ధి చేశానని ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు సునీతాలక్ష్మారెడ్డితో కలిసి మరోసారి ప్రజల ముందుకు వస్తున్నామని, ఇద్దరం కలిసి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో అభివృద్ధి సాధ్యమవుతుందని, కాంగ్రెస్, బీజేపీ నాయకుల్లో వారికే సఖ్యత లేదని, ఇరు పార్టీల్లో నాయకత్వ లోపం కనిపిస్తున్నదన్నారు. టికెట్ల కోసం ఇంకా కొట్టుకుంటూనే ఉన్నారని, సఖ్యత లేనప్పుడు వారు ఎలా అభివృద్ధి చేస్తారన్నారు. ప్రతిపక్షాలు గతంలో ఇవ్వని వాటిని నేడు ఇస్తామంటూ, సాధ్యం కాని హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. నిరంతరం ప్రజల కోసం, అభివృద్ధి కోసం పాటుపడే వారిని ఎన్నుకోవాలన్నారు. బీఆర్ఎస్ పార్టీకి అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తున్నదని, సునీతాలక్ష్మారెడ్డి గెలుపు ఖాయమని, ప్రతిపక్షాలు లెక్కలు వేసుకుంటూ కూర్చొవాలన్నారు.

### అవ్వా.. పింఛన్ వస్తున్నదా?

మన్నెవారి జలాల్‌పూర్ గ్రామంలో ప్రచారం అనంతరం వెళ్తున్న సునీతాలక్ష్మారెడ్డిని కలువాలని వృద్ధులు, స్థానిక నాయకులను కోరారు. వారు ఈ విషయాన్ని సునీతాలక్ష్మారెడ్డికి తెలుపగా వారి వద్దకు వచ్చిన ఆమె వారిని ఆప్యాయంగా పలకరిస్తూ.. అవ్వా పింఛన్ వస్తున్నదా.. ఊర్లో అన్ని సీసీ రోడ్లు అయ్యాయా అని అడిగారు. దీంతో వారు ప్రతి నెలా పింఛన్ ఠంచన్‌గా వస్తున్నదని, ఆ సారు సల్లంగుండాలని చేతులెత్తి సీఎం కేసీఆర్‌కు నమస్కారం చేశారు. ఇలాంటి అనేక పనులు చేసుకోవాలంటే కారు గుర్తుకు ఓటు వేసి, తనను గెలిపించాలని సునీతాలక్ష్మారెడ్డి కోరారు. పనులు మంచిగా అవుతున్నయని, కారు గుర్తుకే ఓటేస్తామని వృద్ధులు తెలిపారు.



దామరంచలో భారీ ర్యాలీగా వస్తున్న సునీతాలక్ష్మారెడ్డి

### గిరిజన వేషధారణలో...

మన్నెవారి జలాల్‌పూర్‌తండాకు రాగానే గిరిజన మహిళలు తమ సాంప్రదాయ దుస్తులను సునీతాలక్ష్మారెడ్డికి ఇచ్చారు. వారిని అలంకరించిన సునీతారెడ్డి వారితో కలిసి మాట్లాడి, వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు పలు పనులను సునీతారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, వాటిని పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మహిళతో కలిసి సేవాలాల్, భవానీ మాత దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి, పూర్ణాహుతి నిర్వహించారు.

### బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

మండలంలోని అందుగులపల్లి, మహ్మద్‌నగర్ తండాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రతిపక్ష పార్టీల నాయకులు చేరుతున్నారని, వారికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు అండగా నిలుస్తుందన్నారు.

### గ్రామగ్రామాన ఘనస్వాగతం

నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రచారం సందర్భంగా గ్రామగ్రామాన పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, శ్రేణులు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. డప్పుచప్పుళ్లతో పటాకులు కాల్చుతూ, జై బీఆర్ఎస్.. జై కేసీఆర్ అంటూ నినాదాలు చేస్తూ ముందుకుసాగారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాలను ఆసక్తిగా చూస్తూ, ప్రసంగాలు విన్నారు. దామరంచలో వృద్ధుడు ర్యాలీ సందర్భంగా కర్రతో నృత్యం చేస్తూ తన అభిమానాన్ని చాటుకున్నాడు. ప్రచారంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, జడ్పీటీసీ రమేశ్‌గౌడ్, వెల్దుర్తి ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అనంతరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాయకులు రాజిరెడ్డి, నర్సింలు, గోపాల్‌రెడ్డి, కృష్ణాగౌడ్, రమేశ్‌చందర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌గుప్తా, కృష్ణ, యాదాగౌడ్, ఖాజా, దుర్గారెడ్డి, అశోక్‌గౌడ్, శాఖారం శ్రీను, గంగాధర్, శ్రవణ్, వెంకటేశం, శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణ గౌడ్, సోమప్ప, రాజులు, సత్యంగౌడ్, వడ్ల నర్సింలు, మల్లేశంగౌడ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

---

# ఆరో రోజు ఎనిమిది నామినేషన్లు

- మెదక్ నియోజకవర్గంలో మూడు, నర్సాపూర్‌లో ఐదు నామినేషన్లు
- ఆర్డీవో కార్యాలయాల వద్ద గట్టి బందోబస్తు
- ఆర్వో కార్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

మెదక్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైన విషయం తెలిసిందే. మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. మెదక్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మెదక్ ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో కార్యాలయం, నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. బుధవారం ఐదో రోజు రెండు నియోజకవర్గాల్లో 8 నామినేషన్లు దాఖలయ్యాయి. మెదక్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అందులో ఒకరు భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) నుంచి నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా చేగుంట మండలం చిన్నశివనూర్ గ్రామానికి చెందిన ఎడ్ల కుమార్, టేక్మాల్ మండలం ఎలకుర్తి గ్రామానికి చెందిన పట్లోళ్ల బాపురెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. భారత చైతన్య యువజన పార్టీ(బీసీవై) నుంచి మెదక్ పట్టణానికి చెందిన వనపర్తి రోహిత్ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను మెదక్ రిటర్నింగ్ అధికారి అంబదాస్ రాజేశ్వర్ స్వీకరించారు.



స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేస్తున్న దృశ్యం

**నర్సాపూర్ నియోజకవర్గంలో..**

నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి బుధవారం ఐదు నామినేషన్లు దాఖలు చేశారు ఇందులో బీఆర్ఎస్ అభ్యర్థి వాకిటి సునీతాలక్ష్మారెడ్డి తరపున ఒక నామినేషన్ దాఖలైంది. కాంగ్రెస్ పార్టీ నుంచి ఆవుల రాజిరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి రెబల్ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. బీజేపీ నుంచి మురళీయాదవ్ తరపున ఒక నామినేషన్ దాఖలైంది.

**ప్రత్యేక ఏర్పాట్లు...**

నామినేషన్ల దాఖలుకు సంబంధించి మెదక్ జిల్లాలో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లోని ఆర్డీవో కార్యాలయాల్లో రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆయా రిటర్నింగ్ అధికారులు అంబదాస్ రాజేశ్వర్, శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రెండు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. కౌంటర్ నంబర్ 1 వద్ద నామినేషన్ల దరఖాస్తు పత్రాలు అందుబాటులో ఉంచారు. కౌంటర్ నంబర్ 2 వద్ద సహాయ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. అభ్యర్థుల వివరాలు పరిశీలించుకుని, సందేహాలను పరిష్కరించుకుని రిటర్నింగ్ అధికారికి అందజేసేలా ఈ సౌకర్యం కల్పించారు.